ఎల్లమ్మను దర్శించుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



అమీర్‌పేట: ఆషాఢ మాసం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మను బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దర్శించుకున్నారు. బుధవారం కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయన పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రుణమాఫీతో రైతు కుటుంబాల్లో ఆనందం

ఉస్మానియా యూనివర్సిటీ: రుణమాఫీతో రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసిందని ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ బుధవారం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు మాఫీ చేయడంతో ఓయూలో చదివే రైతు కుటుంబాలకు చెందిన అనేక మంది విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

గాంధీ ఆర్ఎంఓ-1గా డాక్టర్ శేషాద్రి



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ)-1 గా డాక్టర్ శేషాద్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉస్మానియా ఆస్పత్రిలో ఆర్ఎంఓ-1గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. గాంధీలో విధులు నిర్వహించిన జయకృష్ణ ఉస్మానియాఆస్పత్రికి బదిలీపై వెల్లారు.

ఉత్సాహంగా పోటీలు



సనత్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బుధవారం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్ వద్ద గల గ్రంథాలయంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో విద్యార్థులు సత్తా చాటారు. దాదాపు 200 మంది ఆయా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మోడల్‌కాలనీ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి, గ్రంథ పాలకుడు హరిబాబులతో పాటు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీ డిగ్రీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఆ కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 18 లోపు విద్యార్థులు తమ దరఖాస్తులను స్టడీ సెంటర్‌లో అందజేయవచ్చన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ.31, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 21, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే కానిస్టేబుల్ పండరి తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం. 1లోని గేట్ నంబర్ 5 వద్ద సుమారు 55-60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు బావిస్తున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో అల్లు శిరీష్ పూజలు

అమీర్‌పేట: తెలుగు సినీ నటుడు నటుడు అల్లు శిరీష్ బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్ ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చిలకలగూడ పోలీసులకు సన్మానం



చిలకలగూడ : చిలకలగూడ బోనాల జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికలతో కార్యాచరణ రూపొందించి అమలు చేసిన చిలకలగూడ పోలీసులకు స్థానిక భక్తులు ఘనంగా సన్మానించారు. ఠాణా ప్రాంగణంలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు, మహిళ ఎస్ఐ సబితలతోపాటు పలువురు ఎస్ఐలు, సిబ్బందికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంది నారాయణ, కాసరబాద వెంకటేష్, శ్రీనివాసగౌడ్, డైమండ్‌శ్రీను, మల్లేష్, సతీష్, గౌస్, చిన్న, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా..

శిక్షణ తీసుకుంటున్న ఉపాధ్యాయులు..

- నవంబర్‌లో జాతీయ స్థాయి సర్వే
- 3,6,9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు..

బంజారాహిల్స్: కొవిడ్ అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తగ్గినట్లుగా పలు సర్వేల్లో నిర్ధారణ అయ్యింది. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించి చదువుల్లో మరింత ఉన్నతంగా రాణించే దిశలో వారిని సన్నద్ధం చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఇందులో భాగంగానే విద్యార్థుల్లో సామర్థ్యాలు ఎంతవరకు పెంపొందుతున్నాయి..ఏ సబ్జెక్టులో వెనుకబడుతున్నారు..ఎందుకు వెనుకబడుతున్నారు..? చదువుల్లో రాణించకపోవడానికి కారణాలు ఏమిటి..? అనే విషయాలను తెలుసుకునేందుకు నవంబర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అఛీవ్‌మెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యార్థులను ఈ సర్వేకు సన్నద్ధం చేసే దిశలో ఇప్పటి నుంచే వారిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, సామర్థ్యాలను పెంచే విధంగా బోధన ఉండాలని నిర్ణయించిన ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించింది. ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే 47 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలల పరిధుల్లో 3, 6, 9 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు బుధవారం ఈ శిక్షణ ప్రారంభమైంది. నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే పేరిట నిర్వహించనున్న ఈ పరీక్షకు గాను రెండు విడతలుగా ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. మొదటి విడతలో బుధవారం షేక్‌పేట మండల పరిధిలోని 40 మంది ఉపాధ్యాయులకు, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ ప్రారంభమైంది. గురువారం మరో 40 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన విద్యార్థులు కాంప్లెక్స్ మండల్ లెవల్ ఓరియంటేషన్ శిక్షణలో భాగంగా మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. ఈ శిక్షణ అనంతరం ఉపాధ్యాయులు సదరు విద్యార్థులకు ప్రత్యేక తరహాలో బోధన అందించి మరింత ఉన్నతంగా తీర్చిదిద్దనున్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధిస్తారు. వారిని మానసికంగా మరింత సన్నద్ధం చేసే దిశలో సామర్థ్యాల పెంపుకు దోహదపడతారు. ఖైరతాబాద్-1 మండల పరిధిలో ఎర్రమంజిల్ హైస్కూల్‌లో ఈ శిక్షణ జరుగుతుంది. అలాగే ఖైరతాబాద్-2 మండల పరిధి శిక్షణ కార్యక్రమం జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. రోజువారీ చదువులే కాకుండా విద్యార్థులకు మరింత అవగాహన పెంపొందించే దిశలో ప్రత్యేక తరహా బోధనను ఇచ్చేందుకు కృషి చేస్తున్నారు.

బ్రాహ్మణబస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ, ఏఈ కౌశిక్‌లు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలిసి బుధవారం ఆమె బస్తీలో పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ఓవర్ ఫ్లో, మంచినీరు లో ప్రెషర్, కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని బస్తీవాసులు వివరించారు. అనంతరం మేడిబావిశాఖ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులను పరిశీలించారు.

ఘనంగా ఫలహార బండి ఊరేగింపు



లాలాపేట: బోనాల వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి లాలాపేటలో కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా కోఆర్డీనేటర్ , నాయకులు శ్రీరామ్ శివకుమార్, సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, నాగరాజు, రవి, నవీన్ తదితరులున్నారు.

ఆలయానికి రూ. 2 లక్షల ఆదాయం

రసూల్‌పురా: ఆషాడమాస బోనాల జాతర పురస్కరించుకుని తిరుమలగిరి లాల్ బజార్ మహంకాళి ఆలయానికి రెండు లక్షల రూపాయలకుపైగా భక్తుల నుంచి ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆండాళ్ తెలిపారు. ఆలయ ఈవో సత్య చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. బోనాల జాతర లో భక్తుల నుంచి రూ.2,62,111 లభించినట్లు తెలిపారు. గతంలో కంటే భక్తుల నుంచి ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.

కులగణనపై కేంద్రంపై పోరు

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణన పై కాంగ్రెస్ అవలంబిస్తున్న ద్వంద వైఖరి పై రాష్ట్ర బీసీ నేతలు మండి పడుతున్నారు. కులగణన పై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో కొట్లాడుతుంటే రాష్ట్రంలో మౌనం వహించడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ధ్వజమెత్తారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష చూపరాదు



సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

అడ్డగుట్ట: ఎస్సీ ఎస్టీల పట్ల వివక్ష చూపకూడదని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన అన్నారు. మారేడుపల్లి మండల కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం తుకారాంగేట్‌లోని గడ్డమీదిబస్తీ అంబేద్కర్ భవన్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీవియంసీ సభ్యురాలు కల్పన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం మనుషులదరూ సమానమేనని అన్నారు. విద్య, ఉపాధి అవకాశాలలో దళితుల పట్ల నిర్లక్ష్యం, వివక్ష వహిస్తే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం శిక్షలు తప్పవన్నారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ అధికారి భానుప్రియ, ఆర్ఐ సర్వేష్, బస్తీ నాయకులు సుధాకర్, విజయ, రమ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ' సమస్యలు పరిష్కరించండి



గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారికి అభినందనలు తెలియజేస్తున్న మర్రి పురూరవరెడ్డి

సనత్‌నగర్: గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజకుమారికి బీజేపీ యువనేత మర్రి పురూరవరెడ్డి అభినందనలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. గాంధీ ఆస్పత్రి మార్చురీ నుంచి తరచుగా ఉత్పన్నమయ్యే దుర్వాసన సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిందిగా ఆమెకు విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, వికాస్, మాంచాల గోపీ, స్వామి, పిట్ల శ్రీనివాస్, పార్శి పరమేష్, వంశీ తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా బస్ సర్వీసులు నడిపిస్తున్నామని ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ కేఎస్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తరువాత రీజన్‌లో మహిళా ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. గతంలో నిత్యం 5.5 లక్షల మంది మహిళలు ప్రయాణించే వారని ప్రస్తుతం వారి సంఖ్య 11 లక్షలకు పెరిగిందన్నారు. రోజూ 1,346 బస్సులు నడిపిస్తున్నామన్నారు. రీజన్‌లో 111 ఎలక్ట్రిక్ బస్సులు కొత్తగా వచ్చాయి, మరో 65 మెట్రో డీలాక్స్, 140 మెట్రో ఎక్స్ ప్రెస్, 60 ఆర్డినరీ, బస్సులు రావాల్సి ఉందన్నారు. ఇవి అందుబాటులోకి వస్తే మరిన్ని సర్వీసులు నడిపించే అవకాశం ఉందన్నారు. ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

11న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజనుల చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని ఉత్సవాలను హైదరాబాద్ రవీంద్ర భారతీలో ఈ నెల 11న నిర్వహించనున్నట్లు జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ బుధవారం తెలిపారు. హెచ్‌సీయూ వర్సిటీకి సర్దార్ సర్వాయి పాపన్న పేరుపెట్టాలని, ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు.

యువతి బెదిరింపులతో వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్: యువతి బెదిరింపులకు గురిచేయడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కార్మికనగర్ సమీపంలో నివాసం ఉండే కె.రమేష్ (33) గత ఐదేళ్ళుగా బసవతారకం ఆసుపత్రిలోని ఓ వైద్యుని వద్ద కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా సోమవారం సాయంత్రం ఓ యువతి రమేష్‌కు వీడియో పంపింది. వెంటనే తన వద్దకు రావాలని లేకపోతే చనిపోతానని బెదిరించింది. ఆ వీడియోను చూసిన రమేష్ భార్య నిలదీయగా గత కొంతకాలం కిందట ఝాన్సీ అనే యువతితో పరిచయం అయిందని, ప్రస్తుతం దూరంగా ఉన్నానని దీంతో వీడియోలు పంపుతున్నట్లు తెలిపాడు. ఈ క్రమంలోనే ఈనెల 30వ తేదీన రమేష్ బాత్రూంలో యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన అతడి భార్య రమేష్‌ను ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు తెలియజేశారు. ఝాన్సీ అనే యువతి వీడియోలు పంపడం వల్లనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ మృతుడి భార్య మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్

కంటోన్మెంట్: విద్యార్థుల భద్రతకు పోలీసు శాఖ ప్రత్యేక కృషి చేస్తోందని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని సెయింట్ ఆండ్రూస్, సికింద్రాబాద్‌లోని గీతాంజలి దేవాశ్రయ్ స్కూల్ విద్యార్థులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్స్, డ్రగ్స్, లింగ వివక్ష, మానసిక, శారీరక ఆరోగ్యం తదితర అన్ని రకాల సమస్యలపై పోలీసులను సంప్రదించాలని సూచించారు.

సికింద్రాబాద్ అభివృద్ధికి రూ. 200 కోట్లు కేటాయించాలి



సికింద్రాబాద్ స్థూపానికి పాలాభిషేకం చేసిన లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 200 కోట్లు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. రాణిగంజ్ కర్బలామైదాన్ బుద్ధభవన్ సమీపంలోని సికింద్రాబాద్ పైలాన్ స్థూపానికి బుధవారం లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఏర్పడి 200 సంవత్సరాలు అయిన సందర్భంగా నాటి సీఎం దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధికి 200 కోట్లు ప్రకటించారని గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ హయాంలో ప్రకటించిన విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే సికింద్రాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలి



విద్యార్థినులకు బ్యాగులు అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని సాధించే వరకు అవిశ్రాంతంగా కృషి చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్యాట్నీ సెంటర్ డీజీఎం రవీంద్ర హిత్నల్లి సూచించారు. బుధవారం ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వెస్ట్ మారేడుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, కంపాస్ బాక్స్‌లను అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణ, అంకితబావంతో లక్ష్య సాధనకు ఎంతో ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డీజీఎస్ గిరిధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'కాగ్నిజెంట్' పరీక్షలో విద్యార్థిని అక్షయ ప్రతిభ

సనత్‌నగర్: కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షలో అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్)కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అక్షయ మొదటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఆమె చూపిన ప్రతిభకు గాను సంస్థ నిర్వాహకులు రూ.80 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను అందజేశారు. రెండో బహుమతిగా లక్ష్మీకళ రూ.20 వేల విలువ చేసే ట్యాబ్‌ను సాధించింది. సుమారు 30 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షకు హాజరుకాగా అక్షయ మొదటి బహుమతి గెలుచుకోవడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్తాతో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు ఆమెను అభినందించారు.



ల్యాప్‌టాప్‌ను గెలుచుకున్న అక్షయ..

రైల్వేలో 116 మంది పదవీ విరమణ



అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 116 మంది రైల్వే ఉద్యోగులు బుధవారం పదవీ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైద్రాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాప్‌లో వీరు పని చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు ఉద్యోగులకు వీడ్కోలు పలుకుతూ సందడిగా మారాయి. రైల్ నిలయంలో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ కే. వెంకటరెడ్డి, సీనియర్ సెక్షన్ ఆఫీసర్లు ఏజీకే. మూర్తి, ముస్తాక్ అహ్మద్, లేఖా భవన్‌లో ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ అకౌంట్స్ శ్రీనివాస్, హజారీలను తోటి ఉద్యోగులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు

ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బుధవారం బీఆర్ఎస్వీ విద్యార్థి నేతలు దహనం చేశారు. సైన్స్ కాలేజీ వైపు నుంచి దిష్టిబొమ్మతో దుసుకొచ్చిన విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మహిళలకు క్షమాపణ చెప్పాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు.పోలీసులు అడ్డుకొని విద్యార్థి నాయకులను అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు చటారి దశరథ్, వెంకటేష్‌గౌడ్, జంగయ్య, నాగేందర్, అవినాష్, శ్రీకాంత్, రామకృష్ణ, పవన్, సాయి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత కృష్ణకు సతీవియోగం



శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి

అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడ ఇందిర నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు రజక కృష్ణ సతీమణి మాలతి బుధవారం మరణించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి దంపతులు ఆమె పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీజేపీ నేతలు మల్లికంటి వీరన్న, సంపత్, చరణ్‌రాజ్, టెంపుల్ సాయి, కిరణ్‌గౌడ్, రాజేష్, రాజ్‌కుమార్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆయుర్వేద కళాశాలలో ఘనంగా బోనాలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బుధవారం ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ప్రాంగణంలోని వింద్యా వాహినీ మాత, హాస్పిటల్ ఆవరణలో ఉన్న శ్రీకనక దుర్గా మాత అమ్మవార్ల వద్ద పూజలు చేశారు. ఆయుష్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆయుర్వేద ప్రొఫెసర్లు, సిబ్బంది అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ స్వరూప రాణి, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్ నాయక్, ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా శ్రీనివాస్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి టి.ఎస్. చారి, కార్యదర్శి లక్ష్మణ్, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, స్పోర్ట్స్ కార్యదర్శి శంకర్‌లతో పాటుగా కళాశాలకు చెందిన పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ స్కాలర్స్, సిబ్బంది పాల్గొన్నారు.